సాక్షి
కుమురం భీం

బుధవారం । 23 । ఆగస్టు । 2023



పత్తిలో చీడపీడల విజృంభణ
గత నెలలో కురిసిన భారీ వర్షాలతోపాటు ఆగస్టులో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పత్తి పంటలో చీడపీడలు విజృంభిస్తున్నాయి. 10లో▸



పల్లెల్లో మూడు ముక్కలాట
జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. పోలీసుల కళ్లుకప్పి రహస్య ప్రదేశాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈనెలలో 29 మందిపై కేసులు నమోదయ్యాయి. 11లో▸

గరిష్టం/కనిష్టం
31.4 /25.9

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీజేపీ పార్లమెంటు కన్వీనర్, జాయింట్ కన్వీనర్ల నియామకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీజేపీ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు స్థానాల్లో నాలుగు జిల్లాల పరిధిలో నలుగురిని నియమించారు. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి కన్వీనర్‌గా అయ్యన్నగారి భూమయ్య(నిర్మల్), జాయింట్ కన్వీనర్లుగా కొలిపాక కిరణ్‌కుమార్(ఆసిఫాబాద్), మయూర్ చంద్రజగతి(ఆదిలాబాద్), పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్‌గా పి.మల్లిఖార్జున్(పెద్దపల్లి), జాయింట్ కన్వీనర్‌గా నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్(మంచిర్యాల)ను నియమించారు. కన్వీనర్లు, కోకన్వీనర్లు లోకసభ నియోజకవర్గ పరిధిలోని జిల్లాల్లో వచ్చే ఎన్నికల్లో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: 2023- 24 విద్యా సంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అర్హులైన మైనార్టీ, బౌద్ధులు, సిక్కు అభ్యర్థుల నుంచి విదేశీ విద్యాపథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 50 శాతం, పీజీలో 60 శాతం మార్కులు సాధించిన వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. సెప్టెంబర్ 21లోగా https://telanganaepass. cgg. gov. inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


లైంగిక వ్యాధులపై అవగాహన అవసరం



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో డీఎంహెచ్‌వో రామకృష్ణ

ఆసిఫాబాద్‌రూరల్: లైంగిక వ్యాధులపై విద్యార్థులకు అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించగా, విజేతలకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రశంసా పత్రాలు అందించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కౌమర దశలో విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లైంగిక వ్యాధులపై అవగాహన కలిగి ఉండటంతోపాటు హెచ్ఐవీ నివారణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఉన్నత చదువులు చదవాలన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి సుధాకర్‌నాయక్, ఉపాధ్యాయులు శ్యాం, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జానపద దినోత్సవం



సంప్రదాయ వాయిద్యాలకు పూజలు చేస్తున్న ఆదివాసీలు


జైనూర్(ఆసిఫాబాద్): మండలంలోని మార్లవాయి గ్రామంలో మంగళవారం ప్రపంచ జానపద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, కళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. జానపద కళా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం జానపద కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరావ్, నాయకులు హన్మండ్లు, మధుకర్, ఆత్రం భుజంగ్‌రావ్, సుగుణక్క, సీతారం, రాజన్న, శ్రీధర్, విజయ్, ఆనంద్, భీంరావ్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల పనితీరుపై ఆరా

కౌటాల(సిర్పూర్): కౌటాలలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై ఆరా తీశారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అంతకుముందు అదనపు కలెక్టర్‌ను ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో మోనిక, సుధాకర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, సిబ్బంది సన్మానించారు.

ఆసిఫాబాద్ ఆషామాషీ కాదు

- కోవ లక్ష్మికి దీటైన అభ్యర్థి కోసం విపక్ష పార్టీల వేట
- కాంగ్రెస్‌కు ఈ నియోజకవర్గం కంచుకోట
- తెరపైకి రిటైర్డ్ రవాణా శాఖ అధికారి శ్యామ్‌నాయక్ పేరు
- బీజేపీ నుంచి ప్రచారంలో ఇద్దరి పేర్లు



సాక్షి, ఆసిఫాబాద్: సాధారణ ఎన్నికలకు ఇంకా కొన్ని నెలలే గడువు ఉండడంతో సోమవారం అధికార పార్టీ తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఆసిఫాబాద్(ఎస్టీ) నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి టికెట్ ఖరారు చేసినట్లు బీఆర్‌ఎస్ అధినేత ప్రకటించారు. దీంతో ప్రధాన విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అధిష్టానాలు కోవ లక్ష్మికి పోటీగా దీటైన అభ్యర్థులను బరిలో దించాలని యోచిస్తున్నాయి. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ రిటైర్డ్ రవాణా శాఖాధికారి శ్యామ్‌నాయక్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రే ఆయన్ను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ సైతం నియోజకవర్గంపై పట్టున్న అభ్యర్థినే బరిలో నిలపాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా సమాచారం. ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే నువ్వా-నేనా అనే పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వేడెక్కుతున్న రాజకీయం..
ఆసిఫాబాద్.. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఉన్న ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. 1952లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత ఈ నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే పోటీ ఉంటూ వస్తున్నట్లు ఎన్నికల సరళిని బట్టి స్పష్టమవుతోంది. తాజాగా 2023లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీల మధ్యే పోటీ ఉంటుందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించడం.. కాంగ్రెస్, బీజేపీలో టికెట్ల కోసం ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో రాజకీయ వేడి క్రమంగా రాజుకుంటోంది. దీంతో నియోజకవర్గంలో ప్రస్తుతం నేతలందరి చూపు విపక్షాలు ఖరారు చేసే అభ్యర్థులపైనే కేంద్రీకృతమై ఉంది. ఇక టికెట్లు ఆశిస్తున్న నేతలు సైతం ఎవరికి వారు నియోజకవర్గంలో అనుచరులు, మద్దతుదారులను కూడగట్టుకునే పనుల్లో తలమునకలయ్యారు.

తెరపైకి శ్యామ్‌నాయక్ పేరు..
కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో బూత్‌స్థాయి నుంచి మండలస్థాయి వరకు బలమైన క్యాడర్ ఉంది. ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో డాక్టర్ గణేష్ రాథోడ్ ముందు వరుసలో ఉండగా.. ఇటీవలే పార్టీలో చేరిన ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి పేరును పార్టీ జిల్లా అధ్యక్షుడు బలపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో కోవ లక్ష్మికి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. బలమైన అభ్యర్థిని బరిలో నిలిపి మళ్లీ ఈ స్థానంలో పాగా వేయాలని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. అనూహ్యంగా రిటైర్డ్ రవాణా శాఖాధికారి శ్యామ్‌నాయక్‌ను పార్టీలో చేర్చుకుని, అతనికే ఆసిఫాబాద్ టికెట్ ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే శ్యామ్‌నాయక్ భార్య రేఖానాయక్ కూడా బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరనుండడంతో భార్యాభర్తల్లో ఎవరికి ఎక్కడ టికెట్ ఇస్తారో అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఇక బీజేపీలో ఈ స్థానం నుంచి పోటీ చేయడానికి ఆత్మరాం నాయక్, తుడుందెబ్బ నాయకుడు కొట్నాక విజయ్ ఆసక్తి చూపుతున్నారు. ఇందులో ఎంపీ సోయం బాపూరావ్ ఆశీస్సులున్న వ్యక్తికే టికెట్ దక్కుతుందన్న ప్రచారం సాగుతోంది.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ..
ఈ నియోజకవర్గంలో గత మూడు అసెంబ్లీ ఎన్నికల సరళిని పరిశీలిస్తే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధానంగా పోటీ ఉన్నట్లు ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగిన ఆత్రం సక్కు సమీప టీఆర్‌ఎస్ అభ్యర్థి పెందూమ్ గోపిపై 15,286 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో ఆత్రం సక్కుకు 42,907 ఓట్లు రాగా, టీఆర్‌ఎస్ అభ్యర్థి గోపికి 27,621 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి అధికార పార్టీ తరఫున టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న కోవ లక్ష్మికి 59,094 ఓట్లు వచ్చాయి. ఆమెకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆత్రం సక్కుకు 40,039 ఓట్లు పడ్డాయి. టీడీపీ తరఫున బరిలో నిలబడిన మర్సుకోల సరస్వతికి 25,439 ఓట్లు పోలయ్యాయి. టీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి 19,055 ఓట్ల మెజార్టీతో ఆత్రం సక్కుపై విజయం సాధించారు. ఇక 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ టీఆర్‌ఎస్- కాంగ్రెస్ మధ్యే హోరాహోరీగా పోటీ నడిచింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు 171 ఓట్ల స్వల్ప మెజార్టీతో టీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మిపై గెలుపొందారు. ఆత్రం సక్కుకు 65,788 ఓట్లు రాగా.. కోవలక్ష్మికి 65,617 ఓట్లు పోలయ్యాయి. అనంతరం ఆత్రం సక్కు టీఆర్‌ఎస్ పార్టీలోకి చేరడంతో.. ఇప్పుడు కోవ లక్ష్మికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు ప్రత్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తారనే అంశంపై నియోజకవర్గంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- అదనపు కలెక్టర్ దాసరి వేణు
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిగ్రీ చదివిన తనకు సమీకృత కలెక్టరేట్‌లో ఉపాధి అవకాశం కల్పించాలని ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్‌కు చెందిన బొల్లి నాగరాజు కోరాడు. కూలీ పని చేసుకుంటున్న తనకు నివాస స్థలం కేటాయించాలని జిల్లా కేంద్రంలోని రాజంపేటకు చెందిన తిరుసుల్ల శైలజ దరఖాస్తు చేసుకుంది. రెబ్బెన మండలం నెర్పెల్లి శివారులోని వ్యవసాయ భూమిలో ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తొలగించాలని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎర్రబోతుల శంకరయ్య విన్నవించాడు. గతేడాది వరదలతో దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించాలని కాగజ్‌నగర్ మండలం బారెగూడకు చెందిన రైతులు కోరారు. గృహలక్ష్మి పథకం కింద ఆర్థికసాయం అందించాలని తిర్యాణి మండలం మందగూడకు చెందిన కవిత, జైనూర్ మండలం షేక్‌గూడకు చెందిన ఆత్రం ఇస్రు, పి.సోమురావు వేర్వేరుగా అర్జీ సమర్పించారు. 11 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్న తనకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కాగజ్‌నగర్ పట్టణం ఇంద్ర మార్కెట్ ప్రాంతానికి చెందిన ముసరిఫ్ హుస్సేన్ కోరాడు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనప్ప, సక్కు, విప్ సుమన్

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్, ఆసిఫాబాద్ స్థానాల్లో బీఆర్‌ఎస్ టికెట్లు ఖరారైన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. టిక్కెట్ కేటాయించిన అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ప్రజాక్షేత్రంలో విజయం సాధించి కేసీఆర్‌కు బహుమానంగా ఇస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, కోవ అరుణ ఉన్నారు.

పురుషులే అధికం

- జిల్లాలో 4,31,251 మంది ఓటర్లు
- ముసాయిదా జాబితా విడుదల
- ఓటు నమోదుకు మరో అవకాశం



కౌటాలలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు(ఫైల్)

కౌటాల/ఆసిఫాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సవరణ- 2023 కార్యక్రమంలో భాగంగా ఓటర్ల ముసాయిదా తుది జాబితాను సోమవారం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 597 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,31,251 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. ఇందులో మహిళలతో పోల్చితే స్వల్పంగా పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో మరోసారి ప్రత్యేక ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ముసాయిదా తుది జాబితాపై సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలన అనంతరం అక్టోబర్ 4న తుది జాబితాను విడుదల చేయనున్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలతోపాటు అనంతరం నిర్వహించే పంచాయతీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పక్కాగా ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది.

70 వేల మంది కొత్త ఓటర్లు..
ముసాయిదా జాబితా ప్రకారం ప్రస్తుతం జిల్లాలో మొత్తం 4,31,251 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,13,991 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,07,128 మంది పురుషులు, 1,06,847 మంది స్త్రీలు, 16 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు. సిర్పూర్(టి) నియోజకవర్గంలో 2,17,260 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,09,349 మంది పురుషులు, 1,07,902 మంది స్త్రీలు, తొమ్మిది మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే ఈసారి 70 వేల మంది కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలో 3,58,608 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 1,84,444 మంది ఓటర్లు, సిర్పూర్ నియోజకవర్గంలో 1,74,164 మంది ఓటర్లు ఉన్నారు.

కార్యాలయాల్లో జాబితా..
నియోజకవర్గాల వారీగా ఓటరు ముసాయిదా జాబితాను ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. జాబితాపై అభ్యంతరాలు తెలిపే అవకాశం కల్పించారు. అక్టోబర్ 1 వరకు అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు వీలుంది. ఈ ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 19 వరకు మళ్లీ కొత్త వారితోపాటు సవరణల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 4న తుది జాబితా విడుదల చేస్తారు. ఆ జాబితాలో ఓటరుగా నమోదైన వారు మాత్రమే వచ్చే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం..
ఈ నెల 26, 27 తేదీలతోపాటు వచ్చే నెల 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించడంతో ఈ నాలుగు రోజులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు. వారి వద్ద ఓటరు జాబితాను పరిశీలించుకోవచ్చు. ఏదైనా కారణంతో పేరు లేకున్నా.. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారైనా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తుదారు రెండు ఫొటోలు, వయస్సు ధ్రువీకరణ కోసం పదో తరగతి మెమో, చదువులేని వారికి ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, లేదా విద్యుత్ బిల్లులు అందించాల్సి ఉంటుంది. కొత్త ఓటర్లు ఫారం- 6, విదేశాల్లో ఉంటున్న వారు ఫారం- 6ఏ, చిరునామా మార్పు, వివరాల సవరణకు, వైకల్యం గుర్తింపునకు ఫారం- 8ను వినియోగించుకోవాలి. ఫారం- 7 ద్వారా జాబితాలో అభ్యంతరాలు, పేరు తొలగింపు చేసుకోవచ్చు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు


నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	1,07,128	1,06,847	16	2,13,991
సిర్పూర్(టి)	1,09,349	1,07,902	09	2,17,260



ఓటరుగా నమోదు చేసుకోవాలి
ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి. జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా రాజకీయ పార్టీల ప్రతినిధులు, సాధారణ ప్రజలు తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. నిర్దేశించిన తేదీల్లో బీఎల్‌వోలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండి, ఓటుహక్కు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.
– జాడి రాజేశ్వర్, ఆర్డీవో, కాగజ్‌నగర్

ఆదిలాబాద్‌కు ‘ఇంజినీరింగ్’

- జేఎన్‌టీయూకు అనుబంధంగా..
- కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- నిర్మల్ పర్యటనలో సీఎం కేసీఆర్ హామీ
- ఉమ్మడి జిల్లాలో ఇక సాంకేతిక విద్యాభివృద్ధి



GOVERNMENT OF TELANGANA
ABSTRACT
TECHNICAL EDUCATION – Establishment of JNTU Engineering College at Adilabad – Permission – Accorded – Orders – Issued.
HIGHER EDUCATION (TE) DEPARTMENT
G.O.Ms.No.87 Dated 22-08-2023. Read the following:-
ORDER:-
Government after careful consideration of the matter, hereby accord permission for establishment of JNTU Engineering College at Adilabad.
2. Orders regarding courses, staff and budget will be issued separately.
3. The Registrar, Jawaharlal Nehru Technological University, Hyderabad and the Secretary, Telangana State Council of Higher Education, Hyderabad shall take further necessary action accordingly.
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
KARUNA VAKATI
SECRETARY TO GOVERNMENT
To
The Registrar, Jawaharlal Nehru Technological University, Hyderabad.
The Secretary, Telangana State Council of Higher Education, Hyderabad.
Copy to
The Commissioner of Technical Education, Telangana, Hyderabad.
The Finance (EBS.IV) Department.
P.S. to Secretary to C.M.
P.S. to Hon'ble Minister for Finance.
P.S. to Hon'ble Minister for Education.
P.S. to Chief Secretary to Government.
P.S. to Secretary to Government(Education).
SF/SC.
//FORWARDED :: BY ORDER//
SECTION OFFICER

ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి జారీ అయిన ఉత్తర్వులు

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి జారీ అయింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి కరుణ వాకాటి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) అనుబంధంగా ఈ కళాశాల ఏర్పాటు కానుంది. ప్రస్తుతం కాలేజ్ ఏర్పాటుకు సంబంధించి మాత్రమే ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోర్సులు, స్టాఫ్, బడ్జెట్ సంబంధించి ఆర్డర్స్ విడిగా ఇవ్వనున్నట్లు అందులో వెల్లడించారు.

సీఎం హామీ మేరకు..
గత జూన్ 4న నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంలో ఆ రోజు స్పష్టతనివ్వలేదు. కాగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఈ కళాశాల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రభుత్వాన్ని ఒప్పించి ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. దీంతో జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

సాంకేతిక విద్యాభివృద్ధికి దోహదం..
జేఎన్‌టీయూ అనుబంధంగా ఏర్పాటు కానున్న ఈ ఇంజినీరింగ్ కళాశాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాంకేతిక విద్య చదవాలనుకునే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రధానంగా ఇక్కడి నుంచి ఇంజినీరింగ్ విద్య చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లడం ద్వారా ఆర్థిక భారం అవుతోంది. ఈ క్రమంలో ఇక్కడే కళాశాల ఏర్పడితే స్థానికంగానే ఇంజినీరింగ్ విద్య అందనుంది. ఇదిలా ఉంటే ఆదిలాబాద్‌లో ఇప్పటికే ఐటీ హబ్ భవన నిర్మాణ పనులు రూ.40 కోట్లతో కొనసాగుతున్నాయి. మరోపక్క ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌కు ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే రిమ్స్‌లో ఎంబీబీఎస్‌తో పాటు పీజీ చదువులు కొనసాగుతున్నాయి. అగ్రికల్చర్ కళాశాల మొదలు కాబోతుంది. ఐటీ హబ్ నిర్మాణంతో సాంకేతిక విద్య చదివిన వారికి కొలువులు దక్కే ఆస్కారం ఉంది. మరోపక్క ఇంజినీరింగ్ కళాశాల మంజూరుతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- విద్యతోనే అభివృద్ధి: ఎస్పీ సురేశ్‌కుమార్



వెడ్మ శంకర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆదివాసీ పటేళ్లు, గోండ్వాన రాయిసెంటర్ సార్‌మెడిలు, తదితరులతో మంగళవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ రాయిసెంటర్ల ఏర్పాటుకు స్థల కేటాయింపులో చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆదివాసీ పల్లెల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు పకడ్బందీగా పనిచేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. పాత కలెక్టరేట్‌ను ఆదివాసీ యువత ఉపాధి శిక్షణకు కేటాయిస్తామని పేర్కొన్నారు.

పోలీసుశాఖ అండగా ఉంటుంది..
ఎస్పీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రాంత ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. ఆదివాసీలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చట్టాలను గౌరవిస్తూ, సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. మావోయిస్టులు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకులు అని అన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఏ సమస్యలైనా రాయిసెంటర్ల ద్వారా పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో నేరుగా పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. అనంతరం ఆదివాసీ కిక్రి కళాకారుడు వెడ్మ శంకర్, వెడ్మ రామును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, గోండ్వాన జాతీయ మహాసభ ఉపాధ్యక్షుడు అర్జు, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాంతయ్య, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా మేడి కుర్సింగ మోతీరాం, పర్ధాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సుధాకర్, తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ్, అంధ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి



తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి

కోటపల్లి: మండలంలోని మల్లంపేట అటవీప్రాంతం నుంచి చుక్కల దుప్పి గ్రామ శివారులోకి రాగా అక్కడే ఉన్న కుక్కలు గమనించి దాడిచేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి కొట్టి గాయపడిన దుప్పికి ప్రాథమిక చికిత్స కోసం ఫారెస్టు అధికారులకు, పశువైద్యాధికారికి సమాచారం అందించారు. వెటర్నరీ అసిస్టెంట్ లయక్ అలీ దుప్పికి చికిత్స అందించేలోగా చనిపోయింది. దీంతో ఫారెస్టు అధికారులు అక్కడే దహనం చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణ్

లక్సెట్టిపేట: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (35) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం... రాజ్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల భార్యతో గొడవపడగా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

మహిళల సంక్షేమానికే 'ఆరోగ్య మహిళ'



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

జైపూర్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్ తెలిపారు. జైపూర్ మండలం కుందారం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లు, ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీ మంగళవారం ఆయా కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి స్రావ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

పత్తిలో చీడపీడల విజృంభణ

- గత నెలలో ఎడతెరిపిలేని వర్షాలు
- ఆగస్టులో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వాతావరణ మార్పులతో పంటను ఆశిస్తున్న చీడలు



తెల్ల, పచ్చదోమతో పసుపు రంగులోకి మారిన పత్తి



నెన్నెల మండలంలో పత్తి పంట



పత్తిని ఆశించిన పిండినల్లి పురుగు

రసం పీల్చు పురుగులు

- పత్తి పంట చుట్టూ ఎత్తుగా పెరిగే జొన్న లేదా మొక్కజొన్న పంటలను 3 నుంచి 4 దట్టమైన వరుసలో సాగు చేసుకున్నట్లయితే రసంపీల్చు పురుగుల బెడద తక్కువగా ఉంటుంది.
- చేను గట్లమీద అలసందలు సాగుచేయడం వలన మిత్ర పురుగుల సంఖ్య తగ్గుతుంది.
- కాండానికి మందు పూత పద్ధతి ద్వారా విత్తిన 35 రోజుల నుంచి 50 రోజుల్లో మోనోక్రోటోఫాస్ పిచికారీ చేయాలి.

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానంగా సాగవుతున్న పంట పత్తి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10.50 లక్షల ఎకరాల్లో పత్తి విత్తుకున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలు నీట మునిగాయి. ఈ నెలలో పదిహేను రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. వాతావరణంలో వస్తున్న భారీ మార్పులతో పత్తిపంటలో చీడపీడలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం పంట ఎదిగే దశలో ఉంది. వాతావరణ మార్పులతో పాటు నీటితడులు లేక పంటను చీడపీడలు ఆశిస్తున్నాయి. ఒకప్పుడు రసం పీల్చు పురుగులు, తామర పురుగులు, పేను బంక పురుగులు, గులాబీరంగు పురుగు, పచ్చ దోమ, తెల్లదోమ, ఆకుముడత పురుగులు పంట మధ్యకాలంలో మాత్రమే ఆశించేవి. కానీ ప్రస్తుతం తొలిదశ నుంచే పంటను ఆశించి నష్టపరుస్తున్నాయి. గత నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెట్టింపు వర్షాలు కురిస్తే ఈ నెల 18న ఒకసారి మాత్రమే భారీ వర్షం కురిసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. దీంతో చీడపీడలు పెరిగాయి. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ వివరించారు.

పేనుబంక : ఆకుల అడుగు భాగాన పురుగులు గుంపులుగా ఉండి రసాన్ని పీలుస్తాయి. తేనెవంటి జిగట పదార్థాన్ని విసర్జిస్తాయి. దానిమీద నల్లని బూజు ఏర్పడి పంట దిగుబడి తగ్గుతుంది. దీని నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.4 మి.లీ ద్రావణం పంట విత్తిన 30 నుంచి 45 రోజుల దశలో పిచికారీ చేయాలి. 60 రోజుల దశలో ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి 1.20 మి.లీ చొప్పున పిచికారీ చేయాలి. పురుగు ఆశించి ఎండిపోయిన మొక్కలను పీకి తగులబెట్టాలి.

తామర పురుగులు : ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీలుస్తాయి. దీంతో ఆకులు ముడుచుకుపోయి పెళుసుబారుతాయి. ఆకులను తిప్పిచూస్తే అడుగుభాగాన వెండిరంగు చారలు కనిపిస్తాయి. వాటిమీద సూర్యరశ్మి పడితే మెరుస్తాయి.

పచ్చదోమ : పచ్చదోమ ఆశించిన ఆకుల అంచు వెంబడి పసుపుపచ్చగా మారుతాయి. ఆకులు దోనెలాగా ముడుచుకు పోతాయి. మొక్కలు గిడసబారిపోతాయి. ఉధృతి ఎక్కువైతే ఆకులన్నీ రాలిపోతాయి. మొక్కలు చనిపోయే ప్రమాదంఉంది.

తెల్లదోమ : సాధారణంగా పంట ఎదిగి పిందెలు, కాయలు ఏర్పడుతున్న దశలో పంటను ఆశిస్తాయి. ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీలుస్తాయి. మొక్కలు నీరసించి గిడసబారి పోతాయి. కాయలు పక్వానికి రాకుండా పగిలిపోతాయి. తద్వారా దిగుబడులు తగ్గుతాయి. వీటి నివారణకు పసుపు రంగు డబ్బాలను జిగురుపూసి వుంచితే తెల్లదోమ ఆకర్షించడంతో జిగురు అంటుకుంటుంది. పంటలో తెల్లదోమ కనిపిస్తే సైరిత్రాయిడ్ మందులను నిలిపివేయాలి. లీటరు నీటికి 2 మి.లీ ట్రైజోఫాస్ లేదా ప్రొఫెనోఫాస్, 5 మి.లీ వేపనూనే కలిపి ఆకుల అడుగు భాగన పడేటట్లు పిచికారీ చేయాలి.

పిండినల్లి : పత్తి ఆకులు, ఎదిగే కొమ్మలు, గూడ, పూత, పిందె, కాయ, కాండం, నుంచి రసాన్ని పీలుస్తాయి. ఆకులు పసుపుపచ్చగా మారి క్రమేపి ఎండిపోతాయి. మొక్కలు నీరసించి గిడసబారిపోతాయి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కలు నిలువున ఎండిపోతాయి. ప్రాథమిక దశలోనే గుర్తించి లీటరు నీటికి 10 మిల్లీలీటర్ల వేపనూనె, గ్రాము సబ్బు పొడిని కలిపి 10 నుంచి 15 రోజుల తేడాతో మూడుసార్లు పిచికారీ చేయాలి. కలుపు మొక్కలు ముఖ్యంగా వయ్యారి భామ, తుత్తురుబెండ, పాయలాకు, తదితర గడ్డి మొక్కలను నివారిస్తే పిండినల్లి దరిచేరకుండా ఉంటుంది. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.4 మిల్లీ లీటర్లు కలిపి పంట విత్తిన 30 నుంచి 45 రోజుల దశలో పిచికారీ చేయాలి. 60 రోజుల దశలో ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి 1.20 మి.లీ చొప్పున పిచికారీ చేయాలి. పురుగు ఆశించి ఎండిపోయిన మొక్కలు పీకి తగల పెట్టాలి. హెక్టారుకు 1.25 లీటర్ల ప్రొఫెనోపాస్ లేదా 2 లీటర్ల క్వినాల్‌ఫాస్, 2.5 లీటర్ల క్లోరోపైరిపాస్‌లలో ఏదో ఒకదానిని పిచికారీ చేస్తే పిండినల్లి అదుపులోకి వస్తుంది.

ఎర్రనల్లి : పురుగులు ఆకుల అడుగుభాగాన గుంపులుగా చేరి రసాన్ని పీల్చడంతో ఆకులు నీరసించి ఎండిపోతాయి. ఆశించిన ఆకులపైన చిన్న చిన్న పొడలుగా కనిపిస్తాయి. వాతావరణం పొడిగా ఉన్నప్పుడు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు నీటిలో కరిగే గంధకం లేదా 5.0 మిల్లీలీటర్ల డైకోఫాల్ కలిపి పిచికారీ చేయాలి. తేమ ఉన్నప్పుడు ఎకరాకు 35 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి వేసుకోవాలి.

టీజీఎల్ఏ-711 జిల్లా కమిటీ ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీఎల్ఏ-711) సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా కనక చంద్రం హాజరై జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బుర్ర అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా గడీల అరవింద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపతి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్‌గౌడ్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా దేవేందర్, సంయుక్త కార్యదర్శిగా బాలాజీ, మహిళ కార్యదర్శిగా జ్యోతిలక్ష్మి, మీడియా ప్రతినిధిగా చంద్రమోహన్‌రాజు, మహిళా సంయుక్త కార్యదర్శిగా మహేశ్వరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధిగా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా రాజేశ్, కార్యవర్గ సభ్యులుగా మోహన్, కరుణాకర్, లక్ష్మి, సరస్వతీ, సునీత, సత్తయ్యలను ఎన్నుకున్నారు.

గాంధీభవన్‌లో బయోడేటా అందజేసిన శారద



బయోడేటాను అందిస్తున్న శారద

బెల్లంపల్లిరూరల్: మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, బెల్లంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రొడ్డ శారద కాంగ్రెస్ పార్టీ తరుపున అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బయోడేటాను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ప్రజాసంక్షేమం, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికే కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

నస్పూర్: 11వ వేజ్‌బోర్డుకి సంబంధించిన ఏరియర్స్ డబ్బులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గనిపై ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ మొత్తాన్ని ఆగస్టు నెల జీతంతో కలిపి సెప్టెంబర్‌లో చెల్లించాలని తెలిపారు. లేకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో గోదావరిఖనిలో నిర్వహించే ఏఐటీయూసీ 16వ రాష్ట్ర మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టి కిషన్‌రావు, కార్యదర్శి మారపల్లి సారయ్య, వీరభద్రయ్య, ఫిట్ కార్యదర్శి బీర రవీందర్, నాయకులు ఆకుల లక్ష్మణ్, చంద్రశేఖర్, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

వీల్స్ ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

- దిగబడిన ట్రాక్టర్ తీస్తున్న క్రమంలో ప్రమాదం



గుర్నె శంకర్ (ఫైల్)



బోల్తాపడిన ట్రాక్టర్ కింద శంకర్ మృతదేహం

దహెగాం: పొలంలో వీల్స్ కొడుతుండగా ట్రాక్టర్ దిగబడింది. ఆ ట్రాక్టర్‌ను తీస్తున్న క్రమంలో అది బోల్తాపడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని పీకలగుండం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... పీకలగుండం గ్రామానికి చెందిన దుర్గం ప్రభాకర్‌కు చెందిన వీల్స్ ట్రాక్టర్‌పై కుంచవెల్లి గ్రామానికి చెందిన గుర్నె శంకర్ (35) కొంత కాలంగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం పీకలగుండం సమీపంలో పొలంలో వీల్స్ కొడుతున్న క్రమంలో దిగబడింది. దీంతో దిగబడ్డ ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ సహాయంతో తీయడానికి మంగళవారం ప్రయత్నం చేస్తుండగా వీల్స్ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డబ్బుల కోసం కట్టుకథ

- నగదు దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు

కాగజ్‌నగర్‌రూరల్: ఆన్‌లైన్ గేమింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న కలెక్షన్ బాయ్ ప్రమోద్‌సింగ్ తనపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నగదును దోచుకెళ్లినట్లు కట్టుకథ అల్లాడని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీరామ చిట్‌ఫండ్స్‌లో కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్న ప్రమోద్‌సింగ్ సోమవారం ఈజ్‌గాం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలో బహిర్భూమికి వెళ్లానని, అక్కడ గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు తనపై బీరు సీసాలతో దాడిచేసి తన వద్ద ఉన్న రూ.33వేలు దోచుకెళ్లారని ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. కేసును పలు కోణాల్లో విచారించగా ఘటన స్థలంలో దాడి జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని, అదేవిధంగా ప్రమోద్‌సింగ్ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టినట్లు తేలిందన్నారు. మూడేళ్లగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెడుతున్నాడని, గతంలో క్రికెట్ బెట్టింగ్‌లో రూ.2లక్షల60వేలు, మరోసారి లక్ష రూపాయలు పోగొట్టుకున్నాడని తెలిపారు. అదేవిధంగా ఈనెల 20న కూడా కస్టమర్ల నుంచి వసూలు చేసిన రూ.20వేలను బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడని, ఆ డబ్బులను చిట్‌ఫండ్ కంపెనీ ప్రతినిధులకు అప్పగించాల్సి ఉండగా, ప్లాన్ ప్రకారమే తనపై దాడిచేసినట్లు కట్టుకథ అల్లాడని వివరించారు. తప్పుడు సమాచారం ఇచ్చిన ప్రమోద్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ఆడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈజ్‌గాం ఎస్సై రమేశ్‌కుమార్, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

దండేపల్లి: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పీఆర్టీయూ టీఎస్ కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి తెలిపారు. దండేపల్లి మండల కేంద్రంతోపాటు కొర్విచెల్మ, రెబ్బనపల్లి, లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో మంగళవారం పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నారెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్టీయూ టీఎస్ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఐఆర్‌తో కూడిన పీఆర్‌సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావెనవేని రవి, మల్యాల మల్లేష్, సభ్యులు విజేందర్, నరేందర్, రమేష్, రాజేశ్వరి, రాజు, నాగవర్మ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బొగ్గు ఉత్పత్తి ఉత్పాదక లక్ష్యాల సాధనకు తగిన చర్యలు తీసుకోవాలని ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా జీఎం, జనరల్ మేనేజర్ కార్పొరేట్ ఐ అండ్ పీఎం అండ్ ఆన్యువల్ ప్లానింగ్ కమిటీ అధ్యక్షుడు రవికుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంలు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి రవాణా లక్ష్యాలు సాధించడానికి గనుల వారిగా కావాలిస్న యంత్రాలు సామగ్రి తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, ఇన్‌చార్జి ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ పురుషోత్తం రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్‌సింగ్, రాముడు, అధికారులు చిరంజీవులు, డీవీ రావు, వెంకటేశం పాల్గొన్నారు.

బీఈడీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కేబీ ప్రాంగణంలోని ఐటీడీఏ బీఈడీ కళాశాలలో బీఈడీ కోర్సులో ప్రవేశానికి తెలంగాణ రాష్ట్రంలోని అర్హత కలిగిన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో 25 సీట్లు, జీవ శాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 35, భౌతిక శాస్త్రంలో 10, ఆంగ్లంలో 10 సీట్ల చొప్పున మొత్తం 100 సీట్లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారాలను కళాశాల పనిదినాల్లో అభ్యర్థులు ఈ నెల 24 నుంచి సెప్టెంబర్ 23 వరకు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు సమర్పించుటకు వచ్చే నెల 23 సాయంత్రం 5గంటల లోపు కళాశాలలో సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకూ అడ్మిషన్ ఇన్‌చార్జి 9440848073, 8500995561 సంప్రదించాలని కోరారు.

'సమస్యలు పరిష్కరించిన తరువాత ఓటు అడగాలి'

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించిన తర్వాతే బీఆర్ఎస్ ఓట్లు అడగాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ అన్నారు. మంగళవారం మంచిర్యాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం పేద విద్యార్థులతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. విద్యారంగ సమస్యలు, విద్యార్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నాయకులకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. వసతి గృహాలకు పక్కాభవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కార్యదర్శి సన్ని, పట్టణ కార్యదర్శి సిద్ధార్థ, జిల్లా బాధ్యులు ఎస్కేకుతుబ్ ఉన్నారు.

కళ్లెంపల్లిలో చిరుత భయం



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

- నీలుగాయిని తరుముతూ గ్రామం వైపు..

వేమనపల్లి: తెలంగాణ -మహారాష్ట్ర సరిహద్దు గ్రామం కళ్లెంపల్లి గ్రామస్తులు చిరుతపులి భయంతో వణికిపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామ సమీప అటవీ ప్రాంతం వెంట చిరుత సంచరిస్తుంది. వారం రోజుల్లోనే రెండు మేకలను పొట్టన పెట్టుకున్న చిరుత జనావాసాలను ఆనుకొని మూగ జీవాలపై దాడులకు ఎగబడుతోంది. మంగళవారం గ్రామానికి సమీపంలోని గుట్ట వైపు నుంచి వచ్చిన చిరుత రాగిజోర సదరు వద్ద మిట్ట మధ్యాహ్నం నీలుగాయిపై దాడికి యత్నించింది. తప్పించుకున్న నీలుగాయిని గోరిగల తొవ్వ, పంట చేళ్ల వరకు తరుముకుంటూ రావడం గ్రామస్తులు ప్రత్యక్షంగా చూశారు. వారు పెద్ద పెట్టున కేకలు వేయడంతో నీలుగాయిని వదిలి అటవీ ప్రాంతంలోకి చిరుత పరుగులు తీసిందని చూసిన వారు పేర్కొంటున్నారు.

ఒంటరిగా వెళ్లొద్దు..

కళ్లంపల్లి అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం ఉన్నందున గ్రామస్తులు ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని ఒడ్డుగూడం ఎఫ్ఎస్ఓ మీర్జా జియా ఉల్లాబేగ్, ఎఫ్‌బీఓ ప్రణయ్ సూచించారు. గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. అత్యవసరమైతే ఇద్దరు, ముగ్గురు వెళ్లాలని రేకు డబ్బా, టపాసులు తీసుకెళ్లాలన్నారు. ఆలం సుధాకర్ మేకపై దాడి చేసిన ప్రాంతం వైపు చిరుత వచ్చే అవకాశం ఉన్నందున అటవీ సిబ్బంది సీసీ కెమెరాలను అమర్చారు.

ప్రమాద రహిత ఉత్పత్తి సాధించాలి



మాట్లాడుతున్న కేహెచ్ఎన్ గుప్తా

నస్పూర్: భూగర్భ గనుల్లో మానవ తప్పిదాలతో జరిగే ప్రమాదాలను తగ్గించి ప్రమాద రహిత ఉత్పత్తిని సాధించాలని బెల్లంపల్లి రీజియన్ రక్షణ జనరల్ మేనేజర్ కె.హరినారాయణగుప్త తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే న్యూటెక్ గనిపై కార్మికులకు రక్షణ సూత్రాలు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరినారాయణగుప్త మాట్లాడుతూ గనుల్లో ఉద్యోగులు ఆలోచన నైపుణ్యంతో విధులు నిర్వహించాలనే నిర్లక్ష్యం, అజాగ్రత్త, తొందరపాటుతో పనులు నిర్వహించి ప్రమాదాల బారీన పడొద్దని సూచించారు. సూపర్ వైజర్లు పని స్థలాలపై అవగాహన పెంచుకుని ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం గనిలోపల పని స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు, ఎస్ఎంటీసీ మందమర్రి ఇన్‌చార్జి విజయ్ కుమార్, ఎస్‌వోఎం స్వామిరాజు, గ్రూపు ఇంజినీర్ రవిచరణ, రక్షణ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

జేఏసీ కన్వీనర్ గద్దల హన్మంతు మృతి

- జైపూర్ తహసీల్దార్‌గా సేవలు



గద్దల హన్మంతు (ఫైల్)

జైపూర్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కృషిచేసిన, జైపూర్ మండల తహసీల్దార్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గద్దల హన్మంతు(75) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. జైపూర్ తహసీల్దార్‌గా హన్మంతు 2007 జనవరిలో ఉద్యోగ విరమణ పొందాడు. ఆ తర్వాత పూర్తి స్థాయిలో తెలంగాణ ఉద్యమాన్ని మండలంలో ముందుడి నడిపించాడు. ఉమ్మడి జైపూర్ మండల జేఏసీ కన్వీనర్‌గా పని చేస్తూ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఏగిసేలా కీలపాత్ర పోషించాడు. ఏజేసీ కన్వీనర్‌గా మండల ప్రజలకు ఆయన సుపరిచితులయ్యారు. తెలంగాణ వచ్చాక చెన్నూర్ ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా కొనసాగిన నల్లాల ఓదెలు కాలంలో ఓ దఫాలో జైపూర్ మండలం నుంచి జెడ్పీటీసీ లేదా ఎంపీపీ కావాలని కలగన్నాడు. కానీ రిజర్వేషన్ కలిసి రాలేదు. అయితే కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చివరికి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మృతిచెందాడు. అతడి మృతి పట్ల తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధాంజలి ఘటించారు. అతడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఓసీని సందర్శించిన జీఎం



జీఎంను సన్మానిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్: మందమర్రి జీఎంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ మంగళవారం సాయంత్రం ఆర్కేపీ ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించారు. ఓసీలో ఉత్పత్తి, ఉత్పాదకతల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. రక్షణ సూత్రాలను తప్పక పాటిస్తూ ప్రమాదాలు లేని గనిగా ఓసీని తీర్చిదిద్దాలని సూచించారు. మొదటిసారిగా ఇక్కడికి విచ్చేసిన జీఎంను అధికారులు పుష్పగుచ్ఛం అందచేసి శాలువతో సత్కరించారు. ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నాగరాజు, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.